

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు



సంపుటి : 10 సంచిక : 20 పుష్పం : 41-42 05-07-2005

రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥100/-

విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

సఖినేటిపల్లి .................

03-03-05



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, ☎ 08814 - 228858

## గురువు అంటే కనిపించే దైవము

పురాతన కట్టడాల క్రింద ధనం తరచుగా దొరుకుతుంది. దానికి రక్షణగా సర్పాలు కాపలా ఉంటాయని చరిత్ర చెబుతున్నది. ఆ నిధి మనం దక్కించుకోవాలంటే పాములవారిని పిలిపించి వారి నాద స్వరంతో పాములు నిమగ్నమైనప్పడు, ఆ నిధి మనకు కైవసమౌతుంది. అలాగే పరమాత్మ మనలోనే ఉన్నాడు కాని మనస్సు అనే విష సర్పం అరిషడ్ వర్గాలు అనే కోరలు కలిగి పడగవిప్పి దానికి కాపలాగా ఉంది. మన ధ్యాస పరమాత్మని పొందాలనే తపన పడితే కాటేసి జనన మరణ చక్రంలోనికి ఇరికిస్తున్నది. కామక్రోధాలనే దాని విషపు కోరలను పీకటానికై సద్గురువు వద్దకు వెళ్ళాలి. వారు మన మనోధ్యాసను నామ శబ్ధంతో జోడిస్తారు ఆనామ నాద స్వరానికి మనో విజృంభణ ఆగి నశిస్తుంది. గురు కటాక్షం వల్లనే పరమాత్మ అనే నిధి దొరికి భయరహితులమౌతాము. గురువు ఆత్మ నిష్టుడై ఉండటం, అపారమైన కరుణ కలిగి - ఎంత మందమతుడైనా ఆ శిష్యుని స్థాయికి దిగి వచ్చివానికి అర్ధమయ్యే రీతిలో భోదించటానికి ఎంతో దయ - ప్రేమ కలిగి ఉంటాడు. దీనికి మనం మనలను మనం ప్రేమించుకొన్నంత ప్రీతితో గురువును ప్రేమించాలి, కీర్తించాలి, ఆరాధించాలి. గురుభోదను చెవులతో కాకుండా హృదయంతో వినాలి, నాదస్వరాన్ని పాము విన్నట్లు. శ్రీనాన్నగారు అంటారు "పుట్టలో చెదలు పుడతాయి. అందులోనే నశించి పోతాయి అలాగే గురువు అనుగ్రహం లేని జన్మకూడా నశించిపోతుంది. గురువు నీ కూడా వస్తాడు. బండరాళ్ళు అనే అజ్ఞానంలో కూరుకొని

పోయిన నిన్ను విడుదల చెయ్యటంకోసం నీవు వెళ్ళే మార్గం కష్టమైనదైనా, కుళ్ళిపోయి వాసన కొడుతున్నా నీ ఇష్టాన్ని తన ఇష్టంగా చేసుకొని నీ కూడా వచ్చి నిన్ను తరింపచేయటం ముఖ్యమని నిన్ను వెంటాడుతాడు అది వాగ్ధానం" అన్నారు. పాలకై బిడ్డ తల్లికోసం గుక్కపెట్టి ఏడుస్తూ ఉంటే తల్లి తన పనులను ప్రక్కకు పెట్టి తన అమృతధారలను అందించి హృదయానికి హత్తుకొంటుంది. మనం గురు ప్రేమను గురించి అంత గుక్క పెట్టనక్కరలేదు వేమన అన్నట్లు "తనివి తీర గురువుని ధ్యానించి మదిలోన తనువు మరచి గురుని పాదములు తాకితే తరుముకొని వస్తుంది బ్రహ్మతత్త్వం" అన్నారు. గురుర్బ్రహ్మా, గురుర్విష్ణుః, గురుర్దేవోమహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీగురవే నమః అన్న సత్యం నమ్మి గమ్యాన్ని మర్చిపోకుండా జీవించాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**

# గురువే దైవం

ఒక ఊరిలో బిచ్చగాడొకడుండేవాడు. ఒక రోజు దారిన పోతుండగా వాని కాలికి రాయి తగిలింది. క్రిందికి వంగి చూడగా, అది ఏదో రంగురాయిలా మెరుస్తుండటం గమనించి దానిని పైకితీసి పరిశీలించాడు. అది నిజానికి వజ్రం. ఆ విషయం తెలియని బిచ్చగాడు, అందంగా తళుకులీనుతున్న ఆ రాయికి ఎంతో కొంత వెల దొరకక పోతుందా, ఆ పూట తిండికి గడిచిపోతుంది అని ఆశపడి ఒక దుకాణదారుడికి చూపించాడు. అతడు కూడా దానిని వజ్రం అని గుర్తించక, తూనికరాయిగా పనికివస్తుందని భావించి దానిని తీసుకొని ఒక కాణీ ఆబిచ్చగాని చేతిలో పెట్టాడు. దాంతో ఆ బిచ్చగాడు పరమానందపడి పోయి ఆకాణీతో రొట్టె కొనుక్కుని తిని ఆనందించాడు.

దుకాణదారుడు ఆ వజ్రాన్ని తూనికరాయిగా వాడుకుంటూ ఉండగా, ఒకరోజు అనుకోకుండా ఒక వజ్రాల వ్యాపారి ఆ దుకాణానికి రావటం తటస్థించింది. ఎంతో విలువయిన వజ్రాన్ని ఆ దుకాణదారుడు తూనికరాయిగా వాడుకోవటం గమనించి అతను ఆశ్చర్యపోయాడు. అది ఎంతో విలువయిన వజ్రమని ఆ దుకాణదారుడికి తెలియదని గ్రహించి కొంత మూల్యాన్ని చెల్లించి ఆ వజ్రాన్ని తన సొంతం చేసుకున్నాడు. తాను కాణీకి కొన్న

రాయికి అంత పెద్ద మొత్తం వెల రావటంతో ఆ దుకాణదారుడు కూడా సంతోషించాడు.

ఇంటికి వెళ్ళిన తర్వాత వజ్రాల వ్యాపారి ఆ వజ్రాన్ని బాగా సానబెట్టి ధగధగా మెరిసిపోయేలా చేసాడు. కాంతులీనుతున్న ఆ వజ్రాన్ని దుకాణంలో ఉంచాడు. ఆ ఊరి దేవాలయంలో కొలువుతీరియున్న వేణుగోపాలస్వామివారికి వజ్రాల హారాన్ని సమర్పించు కోవాలని ఒక ధనవంతుడు ఆ వజ్రాన్ని చూచి ముచ్చటపడి చాలా పెద్ద మొత్తంలో మూల్యం చెల్లించి దానిని కొని వజ్రాలహారాన్ని తయారుచేయించి స్వామివారికి సమర్పించుకున్నాడు. ఆవిధంగా మట్టిలో దుమ్ముకొట్టుకొని, కాంతిహీనంగా, రాయిలా పడిఉన్న ఆ వజ్రం చివరికి భగవంతునికి కైంకర్యం అయింది.

వజ్రం మట్టిలో పడిఉన్నప్పుడు, బిచ్చగాని చేతిలో ఉన్నా, దుకాణంలో తక్కెటరాయిగా ఉన్నా, వజ్రాల వ్యాపారి దగ్గర ఉన్నా, భగవంతునికి హారంలో చేరినా నిజానికి దాని విలువ ఎప్పుడు ఒక్కటే. అయినా స్థలాన్ని బట్టి దాని విలువ మారిపోయింది. అలాగే ఈ జీవుడు సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపుడు అయినప్పటికీ తన్ను తాను తెలుసుకోలేక బిచ్చగాని చేతిలో రాయిలా విలువ లేకుండా జీవిస్తున్నాడు. కొద్దిమంది జీవులు విద్యావంతులై, కొంత విలువయిన జీవితం గడుపుతున్నారు. అయితే అరుదుగా కొద్దిమంది జీవులు మాత్రం గురు సన్నిధానం చేరి గురోపదేశం పొంది సన్మార్గంలో పయనించి జ్ఞానం అనే తేజాన్ని పొందుతున్నారు. వారిలో కూడా ఏ ఒక్కరో భగవంతుని కృపకు పాత్రులై మోక్షసౌధాన్ని చేరుకుంటున్నారు, జీవన్ముక్తులు అవుతున్నారు.

ఈ జీవుడు ఎన్నో యుగాలుగా జన్మజరామరణ సంసార చక్రంలో పడి నలిగిపోతూ యాతనలు పడుతున్నాడు. మాయలో బంధింపబడి ఉంటున్నాడు. ఉత్కృష్ఠమయిన మానవ జన్మ లభించటం, సద్గురువు లభించటం, మోక్షం పొందాలి అనే కోరిక కలగటం బహు దుర్లభం అని శాస్త్రములు చెపుతున్నాయి. ఆత్మసాక్షాత్కారం కలగాలి అంటే అందుకు సద్గురువుల కృప కావాలి. గురువు వజ్రాల వ్యాపారి వంటివాడు. సాధకునిలో పేరుకుపోయిన అరిషట్‌వర్గాలు అనే మురికిని, మైలను తొలగించి ఉపదేశమిచ్చి సానబెట్టి జ్ఞాన ప్రకాశాన్ని ఇస్తారు, వజ్రంలా తయారుచేస్తారు.

అందరికి సద్గురువులు లభిస్తారా? అంటే అది చాలా కష్టం. దుర్లభం. ఎవరి మనస్సు నిర్మలంగా ఉంటుందో, ఎవరికి అంతఃకరణశుద్ధి కలుగుతుందో వారికి మాత్రమే

భగవంతుని అనుగ్రహం కలుగుతుంది, తద్వారా వారికి సద్గురువు లభిస్తాడు. ఒక్కసారి సద్గురువు లభించినట్లయితే ఆ ఉత్తరక్షణం నుంచే ఆ జీవుని జాతకమే మారిపోతుంది. సాధకులకు గురువే దైవం. హృదయ కుహరంలో పేరుకుపోయిన అజ్ఞానమనే తిమిరాన్ని తొలగించి, దివ్యమయిన జ్ఞానజ్యోతిని వెలిగించేది గురువే. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి అవతారపురుషులు కూడా సద్గురువులను ఆశ్రయించినవారే.

ధృవుడు కూడా నారదుని యొక్క ఆదేశంతో విష్ణుమూర్తి కొరకు తీవ్రమయిన తపస్సు చేసి భగవస్సాక్షాత్కారం పొందాడు. భగవంతుని దర్శనం లభించిన తర్వాత తుచ్ఛమయిన కోరికలు ఎందుకు అని భావించి మోక్షాన్ని ప్రసాదించమని ప్రార్థించాడు. అప్పుడు విష్ణుమూర్తి అంటాడు "మోక్షము కావాలంటే ముందుగా జ్ఞానము కలగాలి. ఆ జ్ఞానాన్ని ప్రసాదించేది గురువులే, కాబట్టి నీవు గురువును ఆశ్రయించు. తద్వారా నీకు మోక్షం లభిస్తుంది". ఆవిధంగా మోక్షాన్ని పొందిన ధృవుడు ఉత్తర దిక్కున నిశ్చలంగా వెలుగొందుతున్నాడు. అట్టి అఖండమయిన జ్ఞానాన్ని సద్గురువుల ద్వారా పొంది జీవన్ముక్తులై, మోక్షపథాన్ని చేరుకోవాలి.

ఓం తత్సత్ ఓం

**బొప్పన అరుణాదేవి,** B.Sc., D.B.M.,

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 03-03-05, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం కష్టపడి విద్యను సంపాదించుకోవాలి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఈ రెండూ మనం నేర్చుకోవాలి. మీకు ఏదైనా యిష్టమైన వస్తువును తిన్నప్పుడు మీరు ఎలా ఎంజాయ్ చేస్తారో, మనం ఆరోగ్యాన్ని కాపాడుకొంటూ ఉంటే మన ఆరోగ్యాన్ని మనం అలా ఎంజాయ్ చేయవచ్చు. ఈ లోకం, మాయ సత్యం అని చెప్పలేకపోతున్నాము, అసత్యం అని చెప్పలేకపోతున్నాము అని ఒక సందర్భంలో ఆచార్యులవారు అన్నారు. ఇప్పుడు మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, మీ దగ్గర కూర్చుని మీరు దుఃఖంలేని వస్తువు, అది మీ హృదయంలోనే ఉంది అని చెపుతూ ఉంటే ఓ పిచ్చోడా బయటకు వెళ్ళు అంటారు. మీకు ఎవరికైనా దుఃఖం వస్తోంది అనుకోండి, ఈ దుఃఖించేది మీరు కాదు, దుఃఖంలేని వస్తువు ఒకటి మీ

హృదయంలో ఉంది, అదే మీరు అంటే మీకు బుర్రకెక్కుతుందా, మీ బుర్ర కెక్కదు, గురువు చెప్పేమాటలు పిచ్చివాడి మాటలులాగ ఉంటాయి, ఆ టైముకు మీకు అలా అనిపిస్తుంది. దుఃఖంలేని వస్తువే మీరు అయినప్పటికీ దుఃఖం మిమ్మల్ని పీడిస్తోంది కదా, ఆ బాధ మీకు తెలుస్తోంది కదా, అది సత్యంలాగ కనిపిస్తోంది కదా. పోనీ ఈ దుఃఖం సత్యమే, ఈ మాయ సత్యమే అని అంగీకరిందామంటే విచారణ చేస్తే అది పత్తాలేకుండా పోతోంది, అది సత్యంకాదు అని మనకు తెలుస్తోంది. మీరు సబ్జక్టును బాగా శ్రవణం చేయండి, మహిమల జోలికి వెళ్ళవద్దు, వాటిలోనికి వెళితే లోకవాసన పెరిగిపోతుంది. ఈ లోకంలో ఉన్న వ్యక్తులమీద,

ల ో క ం ల ో

ఉన్న వస్తువుల మీద ఎంతకాలం అయితే మనకు ఆసక్తి ఉందో అంతకాలం మనకు పునర్జన్మ వస్తుంది. నాన్నగారు మీరు నిజమైన ప్రజాస్వామ్యవాది అని ఈ మధ్య ఢిల్లీనుండి వచ్చిన స్వామి అన్నారు. మీ గురువు రమణమహర్షి అయినా రమణమహర్షినే ఆరాధించండి, మీరు తరిస్తారు అని మీరు ఏ మీటింగులోను చెప్పటంలేదు, ఇన్ని మీటింగులు వింటున్నాము, మీకు ఏ దేవుడు ఇష్టమయితే ఆయనను ఆరాధించుకోండి అని చెపుతున్నారు. రాజకీయ పార్టీలలాగ రమణమహర్షికి జనాన్ని పోగుచేయడానికి మీరు ప్రయత్నం చేయటం లేదు, వారు బాగుపడటం ముఖ్యంగా పెట్టుకొన్నారు. వారు శాంతిగా ఉండాలి, ఆనందంగా ఉండాలి, వారు మోక్షానుభవం పొందాలి అని మీరు కృషి చేస్తున్నారు కాని వీరందరిని రమణమహర్షికి భక్తులుగా చేయటానికి మీరు ప్రయత్నంచేయటం లేదు, ఆ ఆలోచన కూడా మీకు లేదు అందుచేత మీరు నిజమైన ప్రజాస్వామ్యవాది అని చెప్పారు. కొంతమంది ఈ లోకంలో ఏమి జరిగినా బాధపడిపోతూ ఉంటారు, అంటే వాడికి లోకవాసన బలంగా ఉ ంది, వాడికి పునర్జన్మ వచ్చి తీరుతుంది. ఈ లోకంలో ఉన్న వస్తువుల మీద కొంతమందికి విపరీతమైన వ్యామోహం ఉంటుంది, చనిపోయేటప్పుడు కూడా వాటినే తలపెట్టుకొంటూ ఉంటారు, వారికి కూడా పునర్జన్మ వచ్చి తీరుతుంది. లోకం అన్నాక ఏవో సంఘటనలు జరుగుతూ ఉంటాయి, వాడు అలా ఉన్నాడు ఏమిటి, వీడు ఇలా ఉన్నాడు ఏమిటి అని మనకు రియాక్షన్ అనవసరం. వాడిని నియమించేవాడు భగవంతుడే, మనలను నియ మించే వాడు భగవంతుడే. దీనికి మన తలకాయను పాడుచేసుకోవటం అనవసరం. మీరు అందరు ఏదో పూజలు చేసుకొంటున్నారు. పూజ మంచిదే కాని సబ్జక్టును శ్రవణం

చేయాలి. సబ్జక్టును శ్రవణం చేయకపోతే విషయం తెలియదు. మన హృదయంలో ఉన్న సద్వస్తువు అమృతం అంటే దానికి మరణం లేదు, అది శాశ్వతం అంటే నశించనిది. మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుకు, మరణించే ఈ శరీరానికి ఇసుమంతయు సంబంధం లేదు, ముందు ఆ విషయం మనకు తెలియాలి. ఏదో రోజున మన శరీరం ఎలా నశిస్తుందో అలాగే ఏదో రోజున ఈ లోకం కూడా నశిస్తుంది, మరల పునః సృష్టి ప్రారంభమవుతుంది. అందుచేత ఏది నశిస్తుంది, ఏది నశించదు, ఏది మనకు మోక్షాన్ని ఇస్తుంది, ఏది మనలను బంధిస్తుంది ఆ వివేకం మనకు ఉండాలి, అక్కడ మన తలకాయను ఉపయోగించాలి. మీరు స్కూలులో లెక్కలు, సైన్సు ఎంత శ్రద్ధగా వింటున్నారో, ఈ సబ్జక్టును అంతకంటే ఎక్కువ శ్రద్ధగా శ్రవణం చేయాలి అంటున్నారు ఆచార్యులవారు. చెవులు ఉండి ఈ సబ్జక్టును ఎవడైతే శ్రద్ధగా వినడో వాడు చెవిటి వాడితో సమానము అని చెప్పారు. ఏదైనా ఒక మంచిమాట మనకు తెలిస్తే దానిని ఇతరులకు చెప్పకపోతే నోరు ఉన్నా వాడు మూగవాడితో సమానము. కొంతమంది మంచిని చూడలేరు, అటువంటి వారు కళ్ళు ఉన్నా గుడ్డివారితో సమానము. అందుచేత సబ్జక్టును శ్రద్ధగా శ్రవణం చేయాలి. భగవంతుడు మనకు అనుభవంలోనికి రాకుండా కొంతమంది విరోధులు అడ్డుపడుతున్నారు, ఆ విరోధులు మన లోపలే ఉన్నారు. మీ అందరి హృదయాలలో నేను ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతుడు అసత్యం చెప్పడు. ఆయన మన హృదయంలోనే ఉన్నప్పటికీ మనకు అనుభవంలోనికి రావటం లేదు. మనకు అనుభవంలోనికి రాకుండా ఎవరో అడ్డుపడు తున్నారు. అది మనస్సు అనండి, బుద్ధి అనండి, వాసనలు అనండి ఇలా ఎవరో ఒకరు అడ్డు పడుతున్నారు, వాటినే అనుభవవిరోధులు అంటారు. మన శరీరం ఏదో రోజు కాలి బూడిద అవుతుంది కాని ఈ అనుభవవిరోధులు మనకూడా కొత్త శరీరంలోనికి వచ్చేస్తారు. మనం ఇల్లు మారినప్పడు లగేజీ అంతా ఖాళీచేసి కొత్త ఇంటికి తీసుకొనిపోతాము. అలాగే మనం ఈ శరీరాన్ని ఖాళీ చేసినప్పడు అనుభవవిరోధులను కూడా తీసుకొనిపోతాము. ఎవడైనా ఒకడిని మరచిపోయినా, నన్ను తీసుకెళ్ళటం లేదు ఏమిటి అని అడిగి మన కూడా వచ్చేస్తాడు, వారు అందరూ మన కూడా వచ్చేస్తారు వారిని ఆపలేకపోతున్నాము. నీకు మోక్షం కావాలి అంటే ముకుందుడిని ఆరాధించు, ముకుందుడి గురించి శ్రవణం చెయ్యి, ముకుందుడి గురించి మననం చెయ్యి అన్నారు ఆచార్యులవారు. ఎవడు ఆ ముకుందుడు

అంటే నిన్ను అజ్ఞానం నుండి బయటకు తీసుకొని వచ్చే ఆచార్యుడే ముకుందుడు. అజ్ఞానం అంటే ఏమిటి? నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, అది నీకు తెలియకపోవటమే అజ్ఞానము అంతకంటే అజ్ఞానం అంటూ ఏమీ లేదు. ఏ వస్తువునయితే మనం పొందుదాము అనుకొంటున్నామో దాని గురించి విసుగు వచ్చేలా శ్రవణం చేయాలి. ఇక్కడ శ్రద్ధగా విన్నాక మీరు ఇంటికి వెళ్ళి పోవాలి. ఇంటిదగ్గర మీ పనులు చూసుకొని తరువాత ఏకాంతంగా కూర్చొని మీరు విన్న మాటలను మననం చేయాలి. మీరు విన్న మాటలను మీ బుద్ధిలో తిప్పుకోవాలి. ఈ రోజు ఏమి చెప్పారు, ఆ మాటల వలన ఉపకారం ఉందా? ఆ మాటలో రీజన్ ఉందా? ఆ మాటలు మనకు ఎంతవరకు ఉపయోగపడతాయి, ఇందులో మనం తీసుకోవలసిన మాటలు ఎన్ని ఉన్నాయి అని మీరు ఇంటి దగ్గర మీ మనస్సులో ఆ మాటలను తిప్పుకోవాలి. అంతేగాని ఇక్కడ వినేసి, మీరు ఇంటికి వెళ్ళి ఎందుకు పనికిరానివారితో స్నేహాలు చేస్తూ ఉంటే ఇంక మీకు జ్ఞానం ఏమిటి? ఎందుకు పనికిరానివారితో స్నేహాలు చేయటం, ఇక్కడ శ్రద్ధగా విన్నట్లు నటించటం, ఇంక మీకు మననం ఎలా కుదురుతుంది. కాలేజీలో బాగా చదువుకొనే పిల్లలు ఏమి చేస్తారు అంటే మాష్టారు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వింటారు, ఇంటికి వెళ్ళిన తరువాత మొద్దబ్బాయిల దగ్గర కూర్చోరు, వారికంటే బాగా చదివే వారి ఇంటికి వెళ్ళి ఇవాళ మాష్టారు ఇలా చెప్పారు, ఇది నాకు అర్థం కావటం లేదు అని అడిగి తెలుసు కొంటారు, దాని వలన జ్ఞానం పెరుగుతుంది, నీకున్న సందేహాలు తీరిపోతాయి. అలాగ మనం కూడా రకరకాలుగా కష్టపడి జ్ఞానం సంపాదించుకోవాలి. శ్రవణం, మననం, నిధిధ్యాస. మన శరీరాలు ఎక్కడ ఉన్నాయి? ఇంట్లో ఉంటున్నాయి. ఇప్పుడు మన శరీరాలు ఇంట్లో ఎలా ఉంటున్నాయో అలాగ మన మనస్సు గురువు చెప్పిన వాక్యం మీద నిలబడి ఉండాలి, అది నిధిధ్యాస. గోవు అంటే వాక్కు, ఏ రకమైన వాక్యాలు చెపితే నీకు మోక్షం వస్తుందో ఆ వాక్కులను విశదంగా కృష్ణుడు చెప్పాడు కాబట్టి కృష్ణుడికి గోవిందుడు అనే పేరు వచ్చింది. గోవిందుడు వాక్యాలలో మనం జీవించాలి. గోవిందుడి వాక్యాలను మాటలుగా తీసుకొంటూ ధ్యానం చెయ్యటం కాదు, వాటిలో జీవించాలి, అలా జీవిస్తూ ఉంటే మోక్షం రాకుండా ఎలా ఉంటుంది. శ్రవణ మనన నిధిధ్యాసలు ఎందుకు చెప్పారు అంటే ఆత్మజ్ఞాన సముపార్జనకు ఉపాయం కోసం ఇవి అన్నీ చెప్పారు. అంటే శ్రవణం వలన మనకు కొంతమంది విరోధులు పోతారు, మననం వలన కొంతమంది విరోధులు పోతారు. జన్మజన్మలనుండి

మన కూడా వస్తూ, బలిసిపోయిన అలవాట్లు కొన్ని మనకు ఉంటాయి. ఈ అలవాట్ల వలన వచ్చే కష్టం తెలియక పాపం ఆ అలవాట్లను నేర్చుకొంటారు. తరువాత ఆ అలవాట్ల వలన వచ్చే నష్టం తెలుసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తారు. అవి పెద్ద బండరాళ్ళ కింద ఉంటాయి, బయటకు పోవు. భగవంతుడు చెప్పిన వాక్యాలలో మనం జీవించటం వలన ఈ బండరాళ్ళు అన్నీ బయటకు పోతాయి. అంటే అనుభవవిరోధులు అంతా బయటకు పోతారు. సబ్జక్టును శ్రవణం చేయటం వలన మనలో ఈ అలవాట్లు ఉన్నాయి, ఈ అలవాట్ల వలన పరిణామంలో మనకు ఈ నష్టం వస్తుంది అని మనకు తెలుస్తుంది, అలా తెలియటం వలన ఆ అలవాట్లను పోగొట్టుకోవాలనే బుద్ధి మనకు కలుగుతుంది, అప్పుడు ప్రయత్నం చేసి భగవంతుడి దయవలన వాటిని పోగొట్టుకొంటావు, అప్పుడు హృదయంలో ఉన్న సత్య వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది, అప్పుడు సుఖపడతావు.

మీరు వికారాల జోలికి వెళ్ళకండి. మన లోపల పసరు ఉంది అనుకోండి, మనకు వికారం వస్తుంది, కక్కేస్తే ఆ పసరు పోతుంది. కాని మన లోపల ఉన్న వికారాలు అంత తేలికగా పోవు. వికారాలు అంటే మీకు అర్థమవ్వటం కోసం చెపుతున్నాను. మీకు డబ్బు ఉంది అనుకోండి, మీ దేహప్రారబ్ధంలో ఉంటే డబ్బు రావచ్చు, డబ్బు చెడ్డది కాదు. నాకు డబ్బు ఉంది, నాకు డబ్బు ఉంది అని మీకు సంతోషం వస్తోంది అనుకోండి, అది వికారం, అది మన పతనానికి కారణం అవుతుంది. ఈ సంతోషం మీకు రాబోయే జన్మలో అయినా దుఃఖం కింద మారిపోతుంది. మీ దేహప్రారబ్దాన్ని బట్టి మీకు చదువు ఉండవచ్చు, కీర్తి ఉండవచ్చు, ఏదైనా అధికారం ఉండవచ్చు. వాటిలోనుండి మీకు సంతోషం పొంగుతూ వస్తూ ఉంటే చివరకు భవిష్యత్‌లో అది అంతా దుఃఖంగా మారిపోతుంది, ఇదే మనకు కర్మ కింద చుట్టుకొంటుంది. మీకు డబ్బు ఉండనివ్వండి కాని ఆ డబ్బుతో మీరు కలవకండి. ఆ డబ్బుతో మీరు కలిస్తే మీకు గర్వం వచ్చేస్తుంది, ఆ గర్వం మీ పతనానికి కారణం అవుతుంది. కొంతమందికి డబ్బు ఉంటుంది, మంచిగుణాలు ఉంటాయి కాని రాణింపు ఉండదు ఎందుకు అని ఆచార్యులవారిని ఒకరు అడిగారు. ఎన్ని మంచిగుణాలు ఉన్నా లోభిత్వం ఉన్నవాడికి రాణింపు ఉండదు అని చెప్పారు. ఆచార్యులవారు ఏమి చెపుతున్నారు అంటే మన శరీరంలో ఏమీ రోగాలు లేవు అనుకోండి, నాకు రోగాలు లేవు, నాకు రోగాలు లేవు అనుకోవటం కాదు, ఈ రోగాలకేమిటి లెండి, ఈ రోగాలన్నింటి కంటే పెద్దరోగం సంసార రోగం. డాక్టర్ల

దగ్గరకు వెళ్ళి మందులు తీసుకొంటే ఈ సంసార రోగం పోదు. సత్పురుషుల సహవాసం చేయండి, గోవిందుడిని పూజించండి, గోవిందుడి మాటలను పరస్పరం చెప్పకోండి వీటి వలన సంసార రోగం తగ్గుతుంది. మనకు సంసార రోగం ఉంది కాబట్టే మరల జన్మిస్తున్నాము, సంసారరోగం లేనివాడికి పునర్జన్మలేదు. అది కూడా ఒక రోగమే, ఈ రోగంలో నుండి మామూలు డాక్టర్లు నిన్ను బయటకు తీసుకొని రాలేరు, అది గోవిందుడికే సాధ్యం. భక్తి సంపాదించుకోవటం చాలా కష్టం. ఇక్కడకు మీరు అందరు వచ్చికూర్చొని వింటున్నారు అనుకోండి. సఖినేటిపల్లిలో భక్తిలేనివారు కొంతమంది ఉంటారు అనుకోండి. ఏదో చెపుతున్నారు, ఏదో వింటున్నారు అని వారు అనుకొంటారు, కాని వారికి ఒకటి తెలియదు. వారు కూడా వచ్చి ఇక్కడ వింటే భక్తిని సంపాదించుకోవటం ఎంత కష్టమో వారికి తెలుస్తుంది. చదువుకోవటం కంటే, డబ్బు సంపాదించటం కంటే గోవిందుడి పాదాలయందు భక్తి కలిగి ఉండటం చాలా కష్టం. అది వారికి తెలియక ఏదో చెపుతున్నారు, ఏదో వింటున్నారు అని అలా అనుకొంటారు, వారిని మనం విమర్శించకూడదు, ఇందులో ఉన్న కష్టం వారికి తెలియక అలా అనుకొంటున్నారు. స్వార్థం లేకుండా పని చెయ్యటం ఎంత కష్టమో, కీర్తిని ఆశించకుండా పనిచెయ్యటం ఎంత కష్టమో భగవంతుడి పాదాలయందు భక్తిని సంపాదించటం కూడా అంతే కష్టం. ఇక్కడ ఇంతమంది ఉన్నారు, మీ స్వార్థాన్ని మర్చిపోయి ఎప్పడయినా ఒక చిన్నపని చేసారా మీరు ఆలోచించుకోండి. భక్తులందరూ తరించటానికి అచ్యుత, అనంత, గోవింద అని అనుకోమన్నారు వ్యాసులవారు. అచ్యుతుడు అంటే చ్యుతికానివాడు, వాడి స్వరూపంలో నుండి దిగడు, నాశనం కాడు వాడు అచ్యుతుడు, వాడే పరమాత్మ. వాడిని స్తోత్రం చేసినా, నిందించినా అలాగే ఉంటాడు. మనం భగవంతుడిని స్తోత్రం చేయటం ఎందుకు అంటే మనస్సుతో అనుబంధం పెట్టుకోవటం కోసం. లోకం మనుషులతో అనుబంధం పెట్టుకొనే బదులు భగవంతుడితో అనుబంధం పెట్టుకొంటే మనం పవిత్రులం అవుతాము. లౌకికులతో అనుబంధం పెట్టుకొంటే అంతకు ముందు మనం సంపాదించుకొన్న పుణ్యం ఏమైనా ఉంటే పోతుంది. ఎవడైతే ఈ లోకాన్ని నడుపుతున్నాడో, ఎవడైతే కర్మకు సాక్షిగా ఉన్నాడో వాడే నీ హృదయంలో నివాసంగా ఉన్నాడు, వాడే అచ్యుతుడు. వాడు మనకు ఎప్పడు దొరుకుతాడు? ఈ దేహమే నేను, ఈ మనస్సే నేను, ఈ లోకమే నేను అని అనుకొంటూ మనం కాని దానితో తాదాత్మ్యం పొందుతున్నాము. మీరు ఏదైతే కాదో దానితో

తాదాత్మ్యం తగ్గించుకోండి, అప్పుడు హృదయంలో ఉన్న గోవిందుడు మీకు వ్యక్తమవుతాడు. అనంతుడు అంటే అంతం లేనివాడు, ఆయనకు ఆది లేదు, అంతం లేదు. ఈ పంచభూతాలు, సూర్యుడు, చంద్రుడు ఇవి మధ్యలో వచ్చినాయి, ఇవి ఉన్నప్పుడు ఆయన ఉంటాడు, ఇవి అన్నీ లయం అయిపోయిన తరువాత కూడా ఆయన ఉంటాడు, వాడు అనంతుడు. వాడిని స్మరించకపోతే, వాడిని ధ్యానించకపోతే ఎవరిని స్మరిస్తావు, ఎవరిని ధ్యానిస్తావు. గోవిందుడు చెప్పిన వాక్యాలు నీకు ఎంతవరకు అర్థమయితే అంతవరకు అర్థం చేసుకో, ఒకవేళ నీ సందేహాలు తొలగటం లేదు అనుకో ఎవరో మహాభక్తుల ఇంటికి వెళ్ళి, నీ సందేహాలను నివారణ చేసుకో అంటున్నారు ఆచార్యులవారు. నీ సందేహాలను నివారణ చేసుకోవు అనుకో అవి కంటిలో నలుసులాగ, కాలికి గుచ్చుకున్న ముల్లులాగ నిన్ను బాధిస్తాయి, నీ సందేహాలు నిన్ను గోవిందుడి దగ్గరకు వెళ్ళనివ్వవు. గోవిందుడి వాక్యాలను అర్థంచేసుకోవటానికి నీకు తగినంత బుద్ధి ఉండాలి. ఆ బుద్ధి నీకు లేదు అనుకో, నాకు బుద్ధి లేదు, నాకు బుద్ధి లేదు అని ఏడ్చేబదులు ఇంకో బుద్ధిమంతుడిని ఆశ్రయించు అని చెపుతున్నారు. మీలో ఎవరయినా బంగారు పిచ్చుకలు ఉన్నారు అనుకోండి, మీలో ఎవరయినా భాగ్యవంతులు ఉన్నారు అనుకోండి, మీ డబ్బును మీరు దాచుకోండి. అంతేకాని నాకు డబ్బు ఉంది, నాకు డబ్బు ఉంది అని ఆ డబ్బుతో కలిసిపోతే మీకు గోవిందుడు దూరమయిపోతాడు. మీ సంతోషం కోసం గోవిందుడి మీద ఆధారపడండి కాని డబ్బు మీద ఆధారపడవద్దు. చుట్టాలతోటి, స్నేహితులతోటి, పరిసరాలతోటి అతిగా ఉండవద్దు, అతిగా ఉండటం వలన మన కాలం పాడైపోతుంది, గోవిందుడిని స్మరించు కోవటానికి టైము ఉండదు. మరల ఎప్పుడో ఒకప్పుడు ఆ చుట్టం కాని, స్నేహితుడు గాని మనకు విరోధి అయ్యాడు అనుకోండి మరల దుఃఖం వస్తుంది. ఆహారం విషయంలో, వ్యవహారం విషయంలో జాగ్రత్తగా ఉండు, అతి పనికిరాదు. కొంతమంది 24 గంటలు ఏవో నొల్లుకొంటూ ఉంటారు, ఇంక వారికి గోవిందుడి స్మరణ ఉండదు, చివరకు ఎప్పుడో సడన్‌గా చనిపోతారు. చావు దగ్గర ఒక చెడ్డ ఉంది, అది నోటీసు ఇవ్వకుండా వచ్చేస్తుంది. ఇప్పుడు మనం బాగానే ఉన్నాము, ఇంకో గంటలో ఎలా ఉంటామో చెప్పలేము. మనం రోగం వచ్చినప్పుడు తెలిసీ తెలియని వైద్యుడి దగ్గరకు వెళితే, ఆ రోగాన్ని పెంచేస్తారు, నీకు పెద్ద జబ్బు అని చెపుతారు. అలాగే తెలిసీ తెలియని గురువును ఆశ్రయిస్తే మనలో ఉన్న అజ్ఞానాన్ని పెంచేస్తాడు. అందుచేత నీవు డాక్టరు దగ్గరకు వెళ్ళేటప్పుడు

ఎంత ఆలోచించుకొని వెళతావో, గురువు దగ్గరకు వెళ్ళేటప్పుడు కూడా అంతగా ఆలోచించుకొని, సమర్థుడైన గురువును ఆశ్రయించు.

ఇదంతా మాయండి, ఇవన్నీ వ్యవహారం గొడవలు అండీ అని అనుకోవద్దు, ఈ వ్యవహారాలను నువ్వు సత్యాన్వేషణకు, నీ హృదయంలో ఉన్న శాంతిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఉపయోగించుకొని అజ్ఞానంలో నుండి బయటకురా. ఈ వ్యవహారం గొడవలలో నువ్వు ధర్మంగా ఉండి, న్యాయంగా ఉండి, నీ పాత్రను జాగ్రత్తగా పోషించుకొని అజ్ఞానంలో నుండి బయటకురా. మాయలో ఉన్నప్పడే గోవిందుడిని ఆశ్రయించి మాయలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చెయ్యి. ఏదో మాయండి, ఏదో అజ్ఞానం అండీ, ఏదో వ్యవహారం అండీ అనుకొంటూ కూర్చోవద్దు, గోవిందుడిని ఆశ్రయించమని నీకు చెప్పేవాడు ఎవడూ లేడా? పోనీ ఉన్నాడు అనుకో, ఉంటే మాత్రం ఏమి ప్రయోజనం ఉంది. ఆకలి లేనివాడు అన్నం తినడు అలాగే జ్ఞానం సంపాదించాలనే కాంక్ష లేనివాడికి గోవిందుడి గురించి చెపితే వాడు వింటాడా? అన్నం తినాలి అంటే ఆకలి ఉండాలి, అలాగే జ్ఞానం సంపాదించాలి అంటే జిజ్ఞాస ఉండాలి. జిజ్ఞాస లేనప్పడు ఎవడైనా చెపితే మటుకు నీవు వింటావా? ఆచార్యులవారిని జగద్గురువు అంటారు. వాడు ఏమతస్థుడయినా, ఏ కులస్థుడు అయినా, ఎక్కడ ఉన్నా ఆత్మజ్ఞాన సముపార్జనకు ఎవడికి ఏ సందేహం వచ్చినా ఆ సందేహాన్ని నివారణచేయగలశక్తి ఉన్నవాడిని జగద్గురువు అంటారు. నీ కాలులో విరిగిన ముల్లును వైద్యుడు ఎలా లాగి బయట పడేస్తాడో అలాగ నీకు ఏ కోణంలో ఏ రకమైన సందేహం ఉన్నా దానిని నివారణ చేసేవాడే జగద్గురువు. మీరు పూజ చేయండి, జపం చేయండి, భగవంతుడి వాక్యంలో జీవించండి, గుడులు చుట్టూ తిరగండి, మంచి క్షేత్రాలకు వెళ్ళండి, మహాత్ములను దర్శించండి కాని వీటిఅన్నింటి యొక్క ప్రయోజనం అద్వైతానుభవం పొందటమే, అది మాత్రం మరిచిపోవద్దు. మనకు అద్వైతానుభవం కలిగేవరకూ ఎవరికో ఒకరికి చెడ్డ చేస్తానే ఉంటాము, ఎవరో ఒకిరిని తిడుతూనే ఉంటాము, ఎందుచేతనంటే వారు మనమే ఒక్కటే అన్న సంగతి మనకు తెలియక ఈ పనులు అన్నీ మనం చేస్తున్నాము. వారు, మనము ఒక్కటే అనే అద్వైతానుభవం మనకు కలిగేవరకూ ఈ కుప్పిగంతులు, ఈ అజ్ఞానం యొక్క చేష్టలు మనం మానలేము. ద్వైతం అంతా మనస్సులోనే ఉంది, చైతన్యంలో ద్వైతం లేదు. గోవిందుడిని స్మరించగా, స్మరించగా నీ బుద్ధి శుచి అవుతుంది, అప్పడు లోపల శుభ్రంగా ఉంటావు, బయట

శుభ్రంగా ఉంటావు, అప్పడు ఈ ద్వైతాన్ని దాటతావు, నీకు అద్వైతానుభవం కలుగుతుంది. అజ్ఞానంలో నుండి బయటపడకుండా జ్ఞానం రాదు, అపవిత్రత నుండి బయటపడకుండా పవిత్రుడవు అవ్వవు. అందుకే గోవిందుడి పాదాలను ఆశ్రయించు. ఎవడిని స్మరించుకొంటూ ఉంటే నీ బుద్ధి శుచి అవుతుందో, ఎవడిని స్మరించుకొంటూ ఉంటే నీవు పవిత్రుడవు అవుతావో, వాడే గోవిందుడు. మీరు జపం చేస్తున్నా, ధ్యానం చేస్తున్నా ఒకటి మాత్రం గుర్తు పెట్టుకోండి, అనుభవవిరోధులు ఎంత బలంగా ఉన్నారో లోపల చూసుకొంటూ ఉండాలి, వాటిని బయటకు తోలాలి, అనుభవవిరోధులను బయటకు నెట్టండి. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ ఇవి అన్నీ నీ మనస్సు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం కాని అవి పారమార్థికసత్యాలు కాదు. నీ అలవాట్ల యొక్క వేగం వలన, నీ తలంపుల యొక్క వేగం వలన నిజంకానిదానిని నిజం అనుకొంటున్నావు, వాటిని డౌట్ చేయలేక పోతున్నావు, వాటిని సత్యం అనుకొంటున్నావు, నీకు చెప్పేవాడు కూడా అవి సత్యం అని చెపుతున్నాడు, ఇంక అందులో నుండి ఎలా బయటకు వస్తావు. మన శరీరం వచ్చి, పోయినట్లే ఈ మూడు అవస్థలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఇవి నూటికి నూరుపాళ్ళు అసత్యం. నీకు ఉన్న అలవాట్లను బట్టి సత్యం అనుకొంటున్నావు, అలా అనుకోవటానికి నీవు అలవాటుపడ్డావు. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలిసేవరకూ ఇలా అనుకోవటం నువ్వు మానవు, ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలో కూడా ఇలా అనుకొంటూనే ఉంటావు. ఈశ్వరానుగ్రహం వలన, గురువు అనుగ్రహం వలన నీ హృదయంలో ఉన్న సత్యం నీకు గోచరించినప్పడు ఈ మూడు అవస్థలలో నుండి బయటకువస్తావు కాని లేకపోతే వీటిలో నుండి బయటకురాలేవు. ప్రతీజన్మలోను మనకు విరోధులు, స్నేహితులు, బంధువులు ఉంటారు. ఏజన్మకు ఆజన్మ మన ప్రారబ్ధాన్ని బట్టి వారు సిద్ధమవుతారు. ఇవన్నీ నీవు సమన్వయం చేసుకోవాలి. ఈ మనుషుల గొడవ ఎందుకు? ఈ అహంకారాల గొడవ నీకు ఎందుకు? ఈ రూపాల గొడవ, నామాల గొడవ ఎందుకు? ఒక నామానికి, ఒక రూపానికి పరిమితమైన వాడి మాట నీకు ప్రమాణమా లేక గోవిందుడు చెప్పిన మాట నీకు ప్రమాణమా? ఆచార్యులవారికి మన మీద ఎంత దయో చూడండి. నీకు బుద్ధిలేదు అనుకో, కనీసం బుద్ధి చెప్పేవాడు కూడా లేడా? అసలు బుద్ధి చెప్పేవాడితో మనం స్నేహం చేస్తే కదా అంటున్నారు. భగవంతుడి కంటే, గోవిందుడి కంటే మన క్షేమం కోరేవారు ఈ లోకంలో ఎవరు ఉంటారు చెప్పండి. ఈ అహంకారము చెప్పిన వాక్యం

మీద మీరు బతుకుతారా, గోవిందుడు చెప్పిన వాక్యం మీకు అక్కరలేదా అంటున్నారు. ఇది మనస్సు, ఇది ఆత్మ అంటున్నారు మనస్సుకు, ఆత్మకు బేధం ఏమిటి అని అడుగుతున్నారు. మనస్సును బయటకు పంపితే మనస్సే అహంకారం అవుతుంది, అదే మనస్సును లోపలకు పంపితే ఆత్మ అవుతుంది. నువ్వు లోపలకు వెళితే ఆత్మ అవుతావు, బయటకు వస్తే అహంకారం అవుతావు. లోపలకు వెళితే శాంతి, బయటకు వస్తే అశాంతి. నీ మనస్సును ఎటుపంపుతావో పంపు, భగవంతుడు నీకు ఆ స్వేచ్ఛను ఇచ్చాడు. ప్రపంచంలో హయ్యస్ట్ సర్వీస్ టీచింగ్ అని ఆచార్యులవారు చెప్పారు. నువ్వు వెయ్యి కోట్లు పెట్టి ఒక పెద్ద సంస్థను నిర్మించవచ్చు కాని ఒక మనిషిని అజ్ఞానంలో నుండి బయటకు తీసుకొని రాలేవు, అది టీచింగ్ వలనే సాధ్య మవుతుంది. జ్ఞానం యొక్క విలువ తెలిసినప్పడు జ్ఞానం సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది. జ్ఞానం యొక్క విలువ ఎప్పడు తెలుస్తుంది అంటే మనం వినగా వినగా శ్రవణం వలన తెలుస్తుంది, అందుకే శ్రవణం చేయాలి. కోటి విద్యలు కూటి కొరకే. కూటికోసం, పొట్టకోసం ఇన్ని విద్యలు నేర్చుకొంటున్నావు, మరి జ్ఞానం కోసం ఏమి నేర్చుకొంటున్నావు, మనం ఎవరిమో మనం తెలుసుకోవటానికి మనం ఏమి ప్రయత్నం చేస్తున్నాము, అసలు ఏమి ప్రయత్నం చేయటం లేదు. నువ్వు అసత్యాన్ని సత్యం అనుకొంటున్నావు. అసత్యాన్ని కనీసం సందేహించే స్థితిలో కూడా నీవు లేవు. శ్రవణం చేయగా చేయగా అప్పడు నీకు సందేహం కలుగుతుంది, శ్రవణం చేయకపోతే ఆ సందేహం కూడా నీకు కలుగదు. మనకు ఎప్పడయినా ఆత్మశాంతి తెలుస్తోంది అనుకోండి, అది బయట ఉన్న వ్యక్తుల మీద కాని, వస్తువుల మీద కాని, సంఘటనల మీద కాని ఆధారపడదు. అది ఉండటం వలననే అది తెలియబడుతూ ఉంటుంది. అప్పడు ఈ ప్రపంచం నిన్ను గౌరవించినా, గౌరవించక పోయినా నీకు ఒక్కలాగే ఉంటుంది. ఎందుచేతనంటే నీ సంతోషంకోసం ప్రపంచం మీద నువ్వు ఆధారపడలేదు. మీకు ధనం ఉండటం దోషం కాదు. మీ ప్రారబ్ధంలో ఉంటే అది వస్తుంది. నీవు దానితో తాదాత్మ్యం పొంది దాని వలన వచ్చే సంతోషం కనుక నీవు అనుభవిస్తూ ఉంటే నీ బుద్ధిలో ఏదో దోషం ఉంది అని అర్థం, మరల అది అంతా ఎప్పటికయినా దుఃఖం కింద మారిపోతుంది. ముందు ఆ దోషం ఏమిటో తెలుసుకొని అందులో నుండి బయటకురా, మన శరీరంలో ఉన్న రోగాలు తెలుసుకోవటానికి రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేయిస్తాము, ఎక్సరేలు తీయిస్తాము అలాగే నీ అంతట నీవు పరిశీలన చేసుకొని నీలో ఉన్న దోషాలు తెలుసుకొని, ఆ దోషాల నుండి

బయటకు రావటానికి ప్రయత్నించు, గోవిందుడిని ఆశ్రయించు నీ హృదయంలో ఉన్న గోవిందుడు నీకు అనుభవంలోనికి రాకుండా అడ్డువచ్చేవారే అనుభవ విరోధాలు, వారిని తొలగించుకోవటానికి ప్రయత్నించు. నువ్వు శ్రవణం చేయవు అనుకో అనుభవవిరోధాలు ఉన్నారని కూడా నీకు తెలియదు. శ్రవణం చేయకపోతే చీకటినే వెలుగు అనుకొంటావు, అసత్యాన్ని సత్యం అనుకొంటావు, మనస్సును ఆత్మ అనుకొంటావు. శ్రవణం చేయకపోతే కనీసం ఈ విషయాలు కూడా నీకు తెలియవు అంటున్నారు ఆచార్యులవారు. ఈ చావు నిజం, పుట్టుకనిజం, లోకం నిజం, శరీరం నిజం, అదృష్టం నిజం, లాభం నిజం, నష్టం నిజం అని అనుభవవిరోధులు చెపుతూ ఉంటారు, వాటి మాయలో పడ్డావా నీకు మిగిలేది సున్నా, అందుచేత ఆచార్యుడిని ఆశ్రయించు. గురువుల దగ్గర, స్వాముల దగ్గర హేళనగా మాట్లాడకూడదు, తెలుసుకోవాలనే బుద్ధితో వినయంగా అడగాలి. అరుణాచలం కొండ మీద గుహనమఃశివాయ అనే గుడి ఉంది, ఆయన సిద్ధ పురుషుడు, ఆయన దగ్గర మహిమలు ఉండేవి. ఒకసారి కొండ మీద గొర్రె చనిపోయింది, గొర్రెల కాపరి తన యజమాని కొడతాడు అని ఏడుస్తూ ఉంటాడు. గుహనమఃశివాయకు వాడి మీద జాలికలిగి ఆ గొర్రెను బతికించాడు. ఈ విషయం తన యజమానికి, ఆ పేటలోని వారికి గొర్రెల కాపరి చెపుతాడు. ఆ గొర్రెల కాపరి అబద్ధం చెపుతున్నాడు అనుకొని ఆ పేటలోని జనం బతికి ఉన్న వాడిని శవపేటికమీద పడుకోమని ఆయన దగ్గరకు తీసుకొనిపోయి స్వామి వీడు చాలా మంచివాడు, చనిపోయాడు, మీరు వీడిని బతికించాలి అని అడిగారు. ఇదంతా హేళన కోసం చేస్తున్నారు అని ఆయన గుర్తించారు. వాడు చనిపోయాడు అని మీరే చెపుతున్నారు కదా, వాడు నిజంగా చనిపోయాడు అన్నారు, ఇంతకూ వాడు నిజంగా చనిపోయాడు. అందుచేత మహాత్ముల దగ్గరకు, స్వాముల దగ్గరకు వెళ్ళినప్పడు హేళన మాటలు, వెటకారం మాటలు మాట్లాడకూడదు, చాలాజాగ్రత్తగా ఉండాలి, వినయంగా మాట్లాడాలి. నువ్వు ఆచార్యుడి దగ్గరకు వెళ్ళినప్పడు ఎలా అడిగితే వారికి చెప్పబుద్ధి కలుగుతుందో అలా అడగాలి. నీ హృదయంలో గోవిందుడు ఉన్నాడు. ఎంత దూరంలో ఉన్నాడో అంతదూరం నీ మనస్సును పిలకపట్టుకొని తోలుకొనివెళ్ళు. నువ్వు వైరాగ్యం పెంచుకొని, వివేకం పెంచుకొని, భక్తిని పెంచుకొని గోవిందుడు నీ హృదయంలో అంతర్యామిగా ఎంత లోతులలో ఉన్నాడో అంత లోతులలోనికి వెళ్ళి వెదికితే నీకు ఆయన లభ్యమవుతాడు. నీకు తలపోటు వస్తోంది అనుకో, దానికి కారణం ఉంటుంది. ఆ కారణం పోతేగాని నీకు తలపోటు తగ్గదు. నీకు

తలపోటు ఉన్నంతకాలం దాని తాలుక దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. అలాగే సంసారానికి కూడా కారణం ఉంటుంది. సంసారకారణం నీకు ఎంతకాలం అయితే ఉందో అంతకాలం సంసారదుఃఖం నిన్ను విడిచిపెట్టదు. సంసార కారణంపోతే సంసారదుఃఖం పోతుంది. సంసారదుఃఖానికి ఏదైతే కారణమో ఆ కారణాన్ని కత్తిరించే వాడే గోవిందుడు, అందుచేత గోవిందుడిని ఆశ్రయించు, వాడే మీకు వైద్యుడు. సూర్యుడికి చీకటిని చూద్దామన్నా కనబడదు అలాగే గోవిందుడు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఒకవేళ ఎప్పుడయినా మనకు దుఃఖం వస్తే బాగుండును అనుకొన్నా అసలు దుఃఖస్పర్శ కూడారాదు. హద్దులులేని సుఖం, దుఃఖస్పర్శలేని సుఖం అదీ మోక్షసుఖం, ఆ సుఖాన్ని ప్రసాదించే వాడే గోవిందుడు, ఆయన పాదాలను ఆశ్రయించు.

మనం చేసేపని ఇతరుల మెప్పుకోసం కాకుండా ప్రేమ కోసం చేస్తూఉంటే ఆపనిలో నుండి మనకు ఆనందం వస్తుంది. దేహం ఎక్కడ పుట్టింది, ఇప్పుడు ఎక్కడ ఉంటోంది, ఎక్కడచనిపోతుంది ఆ విషయాలు అప్రధానమైనవి. అహంకారం ఎంతవరకు నశిస్తోందో చూసుకోండి, అది ప్రధానమైన విషయం. అహంకారం నశించినప్పుడే వాడు నిజమైన సుఖి అవుతాడు. దేవతలను పూజించటంవలన దేవఋణం నుండి బయటకు వస్తాము. పితృదేవతల పేరు మీద మంచిపనులు చేయటంవలన పితృ ఋణం తీరుతుంది. మహర్షులు చెప్పిన మాటలను అధ్యయనం చేసి, ఆరకంగా జీవించటం వలన ఋషిఋణం తీరి పోతుంది. మనం ఏదైనా పనిచేస్తూఉన్నా, మట్లాడుతూఉన్నా, ఆలోచిస్తూఉన్నా లోపల దేహాభిమానం తగ్గుతోందా, లేదా అనిచూసుకోవాలి. దేహాభిమానం తగ్గినవాడు అనుభవించే శాంతి, సుఖం మహాచక్రవర్తి కూడా అనుభవించలేడు. గౌరవాన్ని, అగౌరవాన్ని సమానంగా తీసుకో అని భగవంతుడు చెపుతున్నాడు, వాటిని మనం సమానంగా తీసుకోకపోతే మనస్సుకు లోచూపు రాదు. మనకు అన్నం దొరుకుతోంది కాబట్టి అన్నం విలువ మనకు తెలియదు. కాటన్‌దొర ఒకరోజున పాపికొండల దగ్గర గుర్రం మీద వెలుతూఉంటే ఒక ఆవిడ చిన్నపిల్లవాడిని ఎత్తుకొని ఏడుస్తోంది. కాటన్‌దొర ఆగి ఏమిటి ఏడుస్తున్నావు అని అడిగితే నేను అన్నంతిని వారం రోజులు అయ్యింది. ఈ బిడ్డ బతకాలి అంటే పాలుఇవ్వాలి, నేను తిండి తినకుండా పాలు ఎలావస్తాయి, ఈబిడ్డను బతికించుకోలేకపోతున్నాను అని ఏడ్చింది. ఈ ప్రజలకు ఏదో ఒకటి చేయాలి అని అప్పుడు కాటన్‌దొర అనుకొన్నాడు. ఆయన

ఆనకట్ట మొదులుపెట్టిన రోజున కూలికి వచ్చిన ముసలివ్యక్తి గుండెపోటుతో చనిపోతాడు. మన జనం ఏమన్నారు అంటే గోదావరి నది నీరు సముద్రంలోనికి వెళ్ళిపోవాలి. అలా వెళ్ళకుండా నదికి అడ్డుకట్ట వేస్తున్నారు, నదికి కోపం వచ్చింది అన్నారు. అప్పుడు కూలికి మనుషులు రాకపోతే ఆయన మునసబుల దగ్గరకు, కరణాల దగ్గరకు వెళ్ళి ఈ ప్రాజెక్టు పూర్తి అయితే మీరు సుఖపడతారు అని వారికి నచ్చచెప్పి కూలికి మనుషులను తీసుకొని వెళ్ళేవారు. ఇంట్లో భార్య తిట్లు, బయట కూలీల గొడవ, బ్రిటిష్ గవర్నమెంట్ లండన్ పిలిచి తిట్టింది ఇవిఅన్ని భరించి ఆయన ఆనకట్టను నిర్మించారు. నువ్వు ఏదైనా మంచిపని చేసేటప్పుడు చేసేదిచెయ్యి. గుర్తిసారు, గుర్తించరు ఆ గొడవలోనికి వెళ్ళవద్దు, అది నీకు అనవసరం. మనిషి బ్రతికేదే అహంకారంకోసం బతుకుతున్నాడు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, ఏ గురువును ఆశ్రయించినా అహంకారం నశించాలి, అహంకారం నశిస్తేగాని నిజమైన సుఖం, శాంతి నీకు దొరకదు. కొంతమంది చాలా సిన్సియర్‌గా పనిచేస్తారు, మేము సిన్సియర్‌గా పనిచేస్తున్నాము అనుకొంటారు, దానివలన గర్వం వస్తుంది, మనకు తెలియకుండా దేహగతమైన నేను పెరిగిపోతూ ఉంటుంది. మనిషికి ఆర్థికంగా, కుటుంబపరంగా, సామాజికంగా వచ్చే సమస్యలకంటే వాడి అహంకారం తెచ్చే సమస్యలే, బాధలే చాలా ఎక్కువ. నీశరీరం పుట్టినప్పుడు నీవు పుట్టలేదు, నీశరీరం చనిపోయినప్పుడు నీవు చనిపోవు, అహంకారం పుట్టినప్పుడు నీవు పుట్టావు, అహంకారం మరణిస్తే నీవు మరణిస్తావు, అదే చివరి జన్మ. నువ్వు ఏపని చేస్తున్నావు, ఏమి మాట్లాడుతున్నావు అని భగవంతుడు చూడడు, లోపల నీసంకల్పం ఎలాఉందో చూస్తాడు, మనకు ఎలాంటి సంకల్పాలు వస్తున్నాయో చూసి దానినిబట్టి పునర్జన్మ ఇస్తాడు, అందుచేత మనకు వచ్చే సంకల్పాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మన స్వభావాన్ని మార్చుకోవటం చాలా కష్టం. సత్వగుణాన్ని పెంచుకొంటూ ఉంటే మన స్వభావం మారుతుంది. భక్తి స్వభావాన్ని మారుస్తుంది. నీవు ఏదైతే పొందాలి అనుకొంటున్నావో ఆస్థితినే ఎప్పడూ దృష్టిలో పెట్టుకోవాలి. ఎవరైనా నిన్ను తిడుతూఉంటే వారు తిట్టారు అని నీవు అనుకొంటూ ఉంటే కొన్ని రోజులకు వారి లక్షణాలు నీకు వచ్చేస్తాయి. వారు నిన్ను తిడుతూ ఉన్నా, నీవు ఏదైతే పొందుదామని అనుకొంటున్నావో, ఆస్థితినే నీవు దృష్టిలో పెట్టుకొంటే భగవంతుని అనుగ్రహం కలుగుతుంది, నీవు తరిస్తావు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

21-07-02 గురు **గురుపౌర్ణమి మహోత్సవము**, జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమం (జిన్నూరు)

ఉ॥ గం॥ **6-00**ల నుండి మధ్యాహ్నం గం॥ **12-00**ల వరకు

**సద్గురు దర్శనం**

ఉ॥ గం॥ **8-00**లకు

**శ్రీ రమణ క్షేత్రంలో భగవాన్ పూజ**

మధ్యాహ్నం గం॥ **12-00**లకు

**సద్గురు శ్రీ నాన్నగారు శ్రీ రమణ క్షేత్రంకు విచ్చేయుదురు**

మ॥ గం॥ **2-00**లకు

**శ్రీ డి.వి. సుబ్బరాజు (బెంగుళూరు) దంపతులచే గురుపూజ**

మ॥ గం॥ **2-30** ని॥లకు

**సద్గురు అనుగ్రహ భాషణములు**

**గమనిక :**

**ఉ॥ గం॥ 10-00 ల నుండి మ॥ గం॥ 12-00ల వరకు ప్రసాద వినియోగము**



సద్గురు శ్రీ నాన్నగారితో పోలూరు (తమిళనాడు) డి.ఎస్.పి. టి.కె. రాజశేఖరన్‌గారు



సాగిరాజు రామకృష్ణంరాజు గారిచే రచింపబడిన "అమృతవాహిని"
గ్రంథమును ఆవిష్కరిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు